అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 06 జులై 2023

ఊరపండుగకు సిద్ధమవుతున్న గ్రామదేవతలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలో ఈ నెల 9వ తేదీన ఆదివారం నిర్వహించనున్న ఊరపండుగలో ఊరేగింపుగా తీసుకెళ్లేందుకు గ్రామ దేవతల ప్రతిమలను వడ్రంగులు సిద్ధం చేస్తున్నారు. నగరంలోని అశోక్ వీధిలో వడ్ల దాతిలో పనులు చేపడుతున్నారు. ఇక్కడి నుంచి ఖిల్లాకు తరలించి అక్కడ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నగరంలో ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్టించనున్నారు.


ప్రతిమలను సిద్ధం చేస్తున్న వడ్రంగులు

లిబర్టీ స్కూల్ విద్యార్థులను వేరే స్కూల్‌లో చేర్పించండి : డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లిబర్టీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేయాలి అని డిఇఓ ఎన్వి దుర్గాప్రసాద్ అన్నారు. పాత ఎన్జీవోస్ కాలనీలో అనుమతి లేకుండా కొనసాగుతున్న లిబర్టీ పాఠశాలను ఇటీవల సీజ్ చేసిన విషయం తెలిసింది. అయితే పాఠశాల మేనేజ్మెంట్ అధికారుల నుండి ఎటువంటి అనుమతి తీసుకోకుండా మూసివేసిన పాఠశాలను బుధవారం ఉదయం తెరవడంతో అధికారులు సందర్శించి మరోసారి సీజ్ చేసినట్టు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. పాఠశాలపై మండల విద్యాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేయుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మండల విద్యాధికారికి ఆదేశించారు.

వేతనాలు పెంచరు.. పర్మినెంట్ చేయరు

- నేటి నుంచి గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె బాట
- జీవో 60 ప్రకారం వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

నవతెలంగాణ-విలేకరుల బృందం

పల్లెల్లో పరిశుభ్రత కోసం పరితపిస్తున్న పంచాయతీ కార్మికులను గోడును పాలకులు పట్టించుకోవడం లేదు. పరిశుభ్రత జీపీలు జీపీలు అవార్డులు అందుకుంటున్నా.. కార్మికుల కష్టానికి లెక్కలేకుండా పోతోంది. తమతో గొడ్డు చాకిరీ చేయింకుంటున్నారే కానీ వేతనాలు పెంచడం లేదని, పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించడం లేదని వాపోతున్నారు. కనీస వేతనం అమలు చేసి పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పోరుకు సిద్ధమైయ్యారు.


ఎల్లారెడ్డిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె పోస్టర్‌ను జేఏసీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ వెంకట్‌గౌడ్, కారోబార్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో 12,769 గ్రామపంచాయతిలో పనిచేస్తున్న 50 వేల మంది కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛ తెలంగాణలో అగ్రగామిగా నిలిచిన గ్రామ పంచాయతీ సిబ్బంది , జీవో నెంబర్ 60 లో పేర్కొన్న విధంగా వెంటనే కేటగిరీ వారిగా వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని , ధరలు అగ్గిలాగా భగ్గుమంటుంటే, పంచాయతీ కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నయని తెలిపారు. వెంటనే వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మిక కుటుంబానికి 10 లక్షలు, సాధారణ మరణానికి 5 లక్షల నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి గ్రామపంచాయతీ జేఏసీతో చర్చలు జరిపి జీపి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మె తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు, బాలన్న, కార్యదర్శి ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజు, శేఖర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఆర్మూర్ : తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నేటి నుండి జరిగే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులందరూ జయప్రదం చేయాలని బుధవారం వాల్ పోస్టర్ల ఆవిష్కరణ నిర్వహించినారు. సీఐటీయూ మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య ఆధ్వర్యంలో శాస్త్రి నగర్‌లో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి సూర్య శివాజీ మాట్లాడుతూ జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ను కేటాయించాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాల పెండింగ్ బిల్లును తక్షణమే రిలీజ్ చేయాలి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పద్మారావు, మల్కన్నా, బాజన్న నల్లూరి ముత్తవ్వ, మేతరి సాయమ్మ, చిన్నయ్య అశోక్, చేపూరి తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు


బిచ్కుందలో సీఐటీయూ ఆధ్వర్యంలో బిక్షాటన చేస్తూ నిరసన

ఎఫ్‌సీఐ గోదాములు ఫుల్

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్టు... ఎఫ్‌సీఐ గోదాముల్లో సీఎంఆర్ బియ్యం దిగుమతికి స్థలం లేకపోవడంతో మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారు. వారాల పాటు ఎఫ్‌సీఐ గోదాముల వద్ద లారీలు పడిగాపులు కాస్తున్నాయి. ఒక్కో రైస్ మిల్లర్‌కు చెందిన బియ్యం దించుకునేందుకు 14 రోజులు కూడా పట్టిందని వాపోతున్నారు. ఫలితంగా లోడింగ్ లారీల వెయిటింగ్‌కు రూ.10 వేల అదనపు భారం పడుతోందని రైస్‌మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్ల వద్ద రైతుల ధాన్యం దించుకోవడంలో ఒక్క రోజు ఆలస్యమైతే అధికార యంత్రాంగం అంతా హడావుడి చేస్తుందని, కానీ మిల్లర్లకు సంబంధించిన బియ్యం లోడు దించుకోవడంలో ఆలస్యమైతే పట్టించుకునే నాథుడు లేడని మిల్లర్లు అంటున్నారు. కాగా ఈ విషయంలో ఇప్పటికే ఎఫ్‌సీఐ అధికారులతో సమావేశం నిర్వహించామని, స్థలం లేక ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు.

-నవతెలంగాణ, నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

- సీఎంఆర్ బియ్యం దించుకోవడంలో సమస్యలు
- వారాల పాటు లారీల వెయిటింగ్
- తలలు పట్టుకుంటున్న మిల్లర్లు
- సమావేశం నిర్వహించినా మారని తీరు



కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యం దిగుమతుల్లో ఎదురవుతున్న సమస్యలతో నిజామాబాద్ జిల్లాలోని రైస్ మిల్లర్లు అష్టకష్టాలు పడుతున్నారు. గతేడాది ఖరీఫ్‌తో పాటు ఇటీవల రబీ సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం జిల్లాలోని రైస్ మిల్లర్లకు అప్పగించారు. జిల్లాలోని 80 రైస్ మిల్లులకు పౌర సరఫరాల శాఖ అధికారులు సీఎంఆర్ బియ్యం మిల్లింగ్ కోసం అప్పగించారు. గత రబీ సీజన్‌లో పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవ్వగా.. అందులో నుంచి 7.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లై అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 6.85 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. సీఎంఆర్ బియ్యం ఇవ్వని మిల్లులకు ఈసారి ధాన్యం సరఫరా నిలిపివేశారు. పైగా 125 శాతం పెనాల్టీ విధించారు. 2021-22 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 5 మిల్లర్లను డీఫాల్టర్‌గా జరిమానా విధించారు. రబీ సీజన్ 2021-22కు సంబంధించి 17 మిల్లర్లను డీఫాల్టర్‌గా గుర్తించారు. ఈ విధంగా జిల్లాలో 22 మిల్లర్లుకు జరిమా నాలు విధించారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. సీఎంఆర్ బియ్యం ఇచ్చేందుకు మిల్లర్లు రెడీగా ఉన్నా.. దించుకో వడంలో ఎఫ్‌సీఐ అధికారులు తీవ్ర ఆలస్యం చేస్తున్నారు. ఒక్కో ఏసిక్(లారీలు) బియ్యం దిగుమతి చేసుకునేందుకు సగటున వారం రోజుల పాటు ఎదురుచూడాల్సి వస్తోంది. ఎఫ్‌సీఐ గోదాముల్లో స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి నెలా ఎఫ్‌సీఐ గోదాముల నుంచి బియ్యం సరఫరా అయితేనే లారీల నుంచి బియ్యం దించుకుంటున్నారు.

జిల్లాలో గతంలో ఎఫ్‌సీఐ గోదాముల నిల్వ 3.80 లక్షల మెట్రిక్ టన్నలు ఉండగా.. అది కుదించుకుంటూ ప్రస్తుతం 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు చేరింది. దీంతో బియ్యం దించుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల ఒక్కో లారీకి వెయిటింగ్ ఛార్జీలు, కూలీలు ఇవన్నీ అదనపు భారం అవుతోందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమావేశం నిర్వహించినా...

ఈ సమస్యపై మిల్లర్లు జిల్లా కలెక్టర్‌కు, సివిల్ సప్లై అధికారులకు విన్నవించారు. దీంతో ఎఫ్‌సీఐ అధికారులతో జిల్లా యంత్రాంగం మిల్లర్లు సమావేశం కూడా జరిగింది. కానీ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు.

ప్రతిగ్రామంలో అభివృద్ధి పనులు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్టు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దోమలేడ్గి గ్రామానికి 9 సంవత్సరాలలో 16 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు వెల్లడించారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని పోతంగల్ మండల పరిధిలో కొల్లూరు, దోమలేడ్గి, కోటగిరి మండలంలోని యాద్గార్ పూర్ గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. దోమలేడ్గిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో 11 వేల రెండు పడకల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ చల్లని చూపుతో పూర్తి చేశామని తెలిపారు. దోమలేడ్గి గ్రామంలో పంచాయతీ సెక్రటరీని ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కొల్లూరు, దోమలేడ్గి రహదారిపై బ్రిడ్జి నిర్మాణం, నూతన గ్రామపంచాయతీ భవనం, పల్లెదవఖానాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత శ్రీనివాసరావు, సర్పంచ్ జయరాణి దిగంబర్, ఎంపీటీసీ విటల్, జెడ్పిటిసి శంకర్ పటేల్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య, రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, కో ఆప్షన్ జెడ్పిటిసి సిరాజుద్దీన్, హౌసింగ్ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్

ఉపాధి కూలీల డబ్బులు కాజేత

- అధికారులను నిలదీసిన కూలీలు
- రికవరీ చేయిస్తామని ఉన్నతాధికారుల హామీ

నవతెలంగాణ-వర్ని

తాము ఉపాధి పని చేసినా తమకు డబ్బులు రాలేవని, పనికి రాని వారికి డబ్బులు అందజేశారని పలువురు కూలీలు మండిపడ్డారు. ఈ ఘటన వర్ని మండలం లోని ఎస్ఎన్‌పురం గ్రామ పరిధిలోని కొటయ్య క్యాంప్‌లో బుధవారం చోటుచేసుకుంది. 2018 నుంచి 2023 వరకు చేపట్టిన పనులపై పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నాగమణి సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ చర్చలలో ఏపిఓ ఫిర్యాదు చేసినా 71 మంది ఉపాధి కూలీలతో ఒక్కరిగా వివరాలు అడుగగా కొందరు తమకు డబ్బులు వచ్చాయని, మరికొందరు రాలేదని ఫీల్డ్ అసిస్టెంట్ తీసుకున్నారని ఆరోపించారు. అందుకు సాక్షం కావాలని ఏపీవో అడగగా, మేట్‌లు ఉన్నారని వారితో మాట్లాడి వివరాలు తెలిపారు. తప్పు జరిగితే డబ్బులు రికవరీ చేయిస్తామని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఉపాధి కూలీలకు డబ్బులు కాజేసారా..?

ఉపాధి హామీ కూలీలు పనికి రాకున్నా, పేర్లు లేకున్నా ఉన్నట్లు చిత్రికరించి డబ్బులు తీసుకున్నందుకు బాధ్యులు అయిన కూలీల నుంచి, పీల్డ్ అసిస్టెంట్ నుంచి డబ్బులు వసూల్ చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బషీరొద్దీన్, ఏంపిఓ చందర్, సర్పంచ్ నాగమణి, టెక్నీకల్, కంప్యూటర్ ఆపరేటర్‌లు, పంచాయతీ సెక్రెటరీ సాయిలు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల్లో ఇక దర్జాగా సాగు

- ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు
- పట్టాల పంపిణీలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గిరిజన బిడ్డలు ఇక ఎవరికి భయపడకుండా తెలంగాణ ప్రభుత్వం అందించిన పట్టాలతో పోడు భూముల్లో ఇకపై దర్జాగా పంటలు సాగు చేసుకోవచ్చని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎవరికీ భయపడాల్సిన, అణిగిమనిగి ఉండాల్సిన అవసరం లేకుండా భూముల హద్దులతో కూడిన సమగ్ర నక్షాతో ప్రభుత్వం పక్కాగా పట్టా పాస్ బుక్కులు అందిస్తోందని తెలిపారు. బుధవారం మండలంలోని దొమ్మర్ చౌడ్ తండాలో (డీ.సీ తండా) పోడు భూముల లబ్దిదారులకు మంత్రి వేముల పట్టాలు పంపిణీ చేశారు. అమీర్ నగర్ తండా, సర్పంచ్ తండా, డీ.సీ తండా, కోనాపూర్ కేసి తండా, ఉక్ల నాయక్ తండా, సోమిడి తండా, బిల్యానాయక్ తండా, గుడిమల్యాపూర్ తండాలకు చెందిన 190 మంది లబ్దిదారులకు 590 ఎకరాల పోడు భూమికి సంబంధించిన పట్టా బుక్కులు అందజేశారు. తరతరాలకు జీవనోపాధిని అందించే ఈ భూము లను అమ్ముకోవద్దని మంత్రి హితవు పలికారు. అంతకుముందు మంత్రికి గిరిజన మహిళలు వారి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఇంచార్జి ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగురావు, ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి, జడ్పిటిసి సభ్యురాలు పెరుమాండ్ల రాధ, మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుణవీర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ యాదవ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షు లు రేగుంట దేవేందర్ పాల్గొన్నారు.


పట్టాఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ మంత్రిని ఆలింగనం చేసుకున్న ఓ అవ్వ

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

మండల కేంద్రానికి చెందిన పలువురు గంగపుత్ర సంఘ సభ్యులు, గాంధీనగర్‌కు చెందిన కాంగ్రెస్, బహుజన సమాజ్ పార్టీ లకు చెందిన పలువురు కార్యకర్తలు మంత్రి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వేల్పూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన, ప్రవేశ పెట్టినసంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు పెరుగుతున్నట్టు తెలిపారు.

ఆర్థిక పరిస్థితులతో వీఆర్ఏ ఆత్మహత్య

నవతెలంగాణ-ఎడపల్లి



ఒక వైపు అనారోగ్యం.. మరో వైపు ఆర్థిక సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఏ వీఆర్ఏ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఎడపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాండేరావు వివరాల ప్రకారం.. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ధ్యాన నాగరాజ్ (35) వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో మూడు నెలలుగా విధులకు సైతం హాజరుకాలేదని తెలిపారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు చిన్నపిల్లలున్నారు.

వీఆర్ఏ నాగరాజు మృతి బాధాకరం

తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహించిన ధ్యాన నాగరాజు మృతి చెందడం బాధాకరమని ఎడపల్లి తహసిల్దార్ ఆకుల శేఖర్, నాయాబ్ తహసిల్దార్ నారాయణలతోపాటు కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. నాగరాజు విధుల పట్ల అంకితభావంతో పనిచేసేవారని రెవెన్యూ అధికారులు గుర్తు చేసుకున్నారు. నాగరాజు అంత్యక్రియలకు హాజరై నివాళి అర్పించారు.

అప్పుల బాధతో బిల్ కలెక్టర్ ఆత్మహత్య

నవతెలంగాణ-బోధన్

అప్పుల బాధ భరించలేక బిల్ కలెక్టర్ తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ పట్టణ ఎస్ఐ నరేష్ తెలిపారు. బోధన్ పట్టణంలోని ఏకచక్రనగర్‌కు చెందిన మద్దెల లక్ష్మణ్ (35) బోధన్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్నాడు. గత రెండు సంవత్సరాల క్రితం అప్పులు చేసి ఏక చక్రనగర్లో ఇంటిని నిర్మించుకున్నాడని తెలిపారు. అయితే అప్పటి నుండి అప్పులు ఎక్కువ అవ్వడంతో అది తీర్చే మార్గం లేక మదనపడుతూ మద్యానికి బానిస అయ్యాడని తెలిపారు. దాంతో ప్రతిరోజు అప్పుల బాధలు ఎక్కువవడం తో తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య సబిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేలిన క్షత్రియ స్కూల్ బస్సు టైరు

ప్రమాద సమయంలో సుమారు 30 మంది విద్యార్థులు



టైర్ పేలిన క్షత్రియ స్కూల్ బస్సు

నవతెలంగాణ-వేల్పూర్

క్షత్రియ విద్యా సంస్థల స్కూల్ బస్సు టైర్ ఒక్కసారిగా పెద్ద శబ్దం చేస్తూ పేలింది. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ ఘటన వేల్పూరు మండలం లక్కోరా గ్రామం వద్ద బుధవారం చోటుచేసుకుంది. బస్సు ముందు టైరు అరిగిపోయి పేలిపోయినట్టు తెలుస్తున్నది. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ఉంటే ఎవరూ బాధ్యులని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి సంబంధిత యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. బస్సులో పరిమితికి మించి విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. బస్సు ఫిట్నెస్ లేకుండానే అనుమతులు ఇచ్చారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈవీఎం గోదాముల పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు పనిచేస్తున్న తీరును పరిశీలించారు. వాటి పని తీరును ఇంజనీర్లు వివరించారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎన్నికల పరిశీలకుడు సాయి భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాస్

- 20 వేల లంచం తీసుకుంటున్న పట్టుబడ్డ అధికారి

నవతెలంగాణ-రాజంపేట్

రూ.20 వేల లంచం తీసుకుంటూ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం కొండాపూర్ గ్రామ బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ బుధవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలంలోని ఆరుగొండ సమీపంలో ఓ చిన్న కాలువ ఉండటంతో వర్షాకాలంలో పంట పొలాలకు వెళ్లడానికి వర్షాకాలంలో ఇబ్బంది కావడంతో రైతులందరూ కల్వర్టు నిర్మించుకోవాలని అనుకున్నారు. తలా ఇంత పోగు చేసుకొని కల్వర్టు పనులు ప్రారంభించగా అది గమనించిన బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ కల్వర్టు నిర్మాణ పనులు కొద్ది మొత్తంలో అడవి సరిహద్దుల్లోనికి వస్తున్నాయని, దీనికి గాను తనకు రూ.30,000 ఇవ్వాలని లేదంటే మా పై ఆఫీసర్లకు ఫిర్యాదు చేసి పనులు జరగకుండా చూస్తానని వారికి తెలిపారు. ఇందులో మధ్యవర్తిగా ఉన్న తుల సిద్ధరాములు రైతులతో చర్చించి రూ.20,000 ఒప్పందం చేసుకున్నారు. గతంలో తుల సిద్ధరాములు కూతురు వివాహ సమయంలో వంట కోసం అటవీ ప్రాంతంలో కింద పడ్డ కట్టెలను తీసుకొచ్చినందుకు గాను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా.. ఇచ్చుకోలేనని చెప్పడంతో టేకుతో చేసినటువంటి ఆర్చిని తయారు చేసి ఇవ్వాలని సదరు అధికారి డిమాండ్ చేస్తూ ఉన్నాడు. దీంతో పాటు రైతులందరి నుంచి సేకరించి డబ్బులు ఇవ్వాలని కోరడంతో తుల సిద్ధరాములు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి ట్రాప్ మేరకు డబ్బులు ఇస్తానని రైతుల బీట్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా.. బుధవారం కామారెడ్డి బస్టాండ్ ఎదుట ఓ హోటల్‌లో కలిసారు. రూ.20 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యక్రమంలో సిఐ నగేష్, సిఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్

జ్యూస్‌లో ఫంగస్

రిలయన్స్‌మాల్‌పై ఫిర్యాదు.. రూ.2000 జరిమానా

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో రిలయన్స్ మాల్‌లో పట్టణానికి చెందిన మధు అనే వక్తి ఆరెంజ్ జ్యూస్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యులతో తాగుతున్న సమ యంలో ఆ జ్యూస్ రుచి తేడాగా వచ్చింది. దాన్ని పరిశీలించి చూడగా అందులో బూజు పట్టి ఫంగస్ ఏర్పడిన విషయం వెలుగు చూసింది. దాంతో బాధితుడు తక్షణమే రిలయన్స్ మాల్‌కు వెళ్లి స్టోర్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బోధన్ మున్సిపల్ సానిటరీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకొని జ్యూస్‌ను పరిశీలించారు. అది నాసిరకం ఉండడంతో స్టోర్ మేనేజర్‌కు రూ.2000 జరిమానా విధించారు. గతంలోనూ ఓ కౌన్సిలర్ తీసుకున్న వస్తువులు నాసిరకంగా ఉండడంతో ఆయన సైతం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కుళ్లిపోయిన, ఫంగస్ ఉన్న జ్యూస్‌లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రిలయన్స్‌మాల్‌పై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.


రిలయన్స్ స్టోర్‌కు జరిమానా విధింపు

పీఏసీఎస్ కాంపౌండ్ వాల్‌కు భూమి పూజ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



గుండారంలోని పీఏసీఎస్ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ దాసరి శ్రీధర్, జెడ్పీటీసీ గోపాల్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్ రావ్, ఎంపీటీసీ గంగాధర్, ఉప సర్పంచ్ శంకర్ రెడ్డి, డైరెక్టర్ ఉమాపతి, కిషన్, దశరథ్ రెడ్డి, లచ్చన్న, వీడీసీ ప్రెసిడెంట్ శేఖర్, రాజారెడ్డి సాయారెడ్డి, సిఈఓ అనంతలక్ష్మీ, లింబారెడ్డి పాల్గొన్నారు.

ఈటలను కలిసిన ముదిరాజ్ ప్రతినిధులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియామకం అయిన ఈటల రాజేందర్‌ను ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి అధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లో కలిసి పుష్ప గుచ్చం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో ధర్పల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మచ్చ రఘురాం, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు మద్ది గంగాధర్,ఎల్ ఐ సి గంగాధర్,బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెను జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయూ
- వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నిజామాబాద్‌సిటీ/నవీపేట్

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు, సిబ్బంది పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. పంచాయతీ కార్మికులకు జీఓ నెం. 60 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులను సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జె.ఎ.సి. ఆధ్వర్యంలో గురువారం నుండి జరిగే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను చేపడుతున్నట్టు తెలిపారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు మురళి, కిషన్, అశోక్ రాజేందర్, రవి, రమేష్, భాస్కర్, సుధాకర్, పోసాని తదితరులు పాల్గొన్నారు.



నవీపేట్: సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పంచాయతీ కార్మికులు

నిజామాబాద్‌సిటీ : గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్‌లో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్ మాట్లాడారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, జిల్లా నాయకులు లింగం పాల్గొన్నారు.

నవీపేట్: గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె పోస్టర్లను పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ సమ్మెకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు మేకల ఆంజనేయులు, రాములు, రవి, పోశెట్టి,శంకర్, రాధ, మద్దేపల్లి, గంగాధర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్‌లో 3 నూతన కోర్సులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్ అర్హతతో తర్వాత కోర్సులు ఉపాధి అవకాశాలు మేటి ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి 3 కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ యం.మారయ్య గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండే 3 కొత్త కోర్సులను పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. బిటెక్ (సిఎస్ఈ) 4 సంవత్సరాల కోర్సు ప్రత్యామ్నాయంగా బీఎస్సీ (హనర్ ఇన్ సిఎస్) ఇంటర్ లో ఎంపీసీ చదివి ఎంసెట్ సీటు సాధించని, దూర ప్రాంతాలకు వెళ్ళి చదువుకోలేని విద్యార్థులకు సరిసమానంగా ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. బీబీఏ (రీటైల్ ఆపరేషన్స్) ఇంటర్‌లో ఏ కోర్సైనా ఉత్తీర్ణులైన వారు టియులో రిస్కీ (రీటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు వారంలో 3 రోజులు చదువు కొలువు చేసుకుంటు నెలకు 10వేల వరకు స్టైఫండ్ పొందే అవకాశం ఉందని తెలిపారు. బీబీఏ రీటైల్ ఆపరేషన్స్ పూర్తి చేసిన విద్యార్థులకు 20వేల వేతనంతో ప్లేస్మెంట్ గ్యారంటి సౌకర్యం ఉందని పేర్కొన్నారు. బీబీఏ (హెల్త్ కేర్ మెనెజ్మెంట్) కోర్సు ఇంటర్‌లో ఏ కోర్సైనా ఉత్తీర్ణులై టీయూలో హెచ్ఎస్ఎస్సీ (హెల్త్ కేర్ సర్వీస్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్) వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, కోర్సులో చేరిన విద్యార్థులకు కార్పొరేట్ హాస్పిటల్ మేనేజ్మెంట్లో శిక్షణ ఉంటుందని వివరించారు.

మలుపులో ప్రమాదాల నివారణకు చర్యలు



స్థలంకోసం రైతుతో మాట్లాడుతున్న పోలీసులు

నవతెలంగాణ-ధర్పల్లి

ఎన్నో యేండ్లుగా మండల కేంద్రానికి సమీపంలోని సిరికొండకు వెళ్లే రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదకర మూల మలుపుని సిఐ సైదా, ఎస్ఐ వంశీ కృష్ణలు స్పందించి, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మూల మలుపు సమస్యను బుధవారం శాశ్వతంగా తొలగించడంలో శభాష్ పోలీస్ అనిపించుకున్నారు. మూలమలుపు తొలగింపునకు అవసరమైన స్థలంకోసం పీసు రాజారామ్‌తో సిఐ, ఎస్ ఐ మాట్లాడి స్థలం ఇచ్చేందుకు ఒప్పించారు. ప్రమాదాల నివారణపై తీసుకున్న చర్యలపట్ల సీపీ ప్రవీణ్ కుమార్, ఏసీపీ కిరణ్ కుమార్లు సిఐ, ఎస్ఐ లకు అభినందించారు. పోలీసులు తీసుకున్న చర్యాలకు హ్యాట్సాఫ్ అంటున్నారు వాహనదారులు.

సీశాట్ హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీసర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ (పదినెలల రెసిడెన్షియల్) కోచింగ్‌కోసం దరఖాస్తు చేసుకున్న వారు జూలై 5 నుంచి హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవచ్చని స్టేట్ స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.శశికళ, స్టడీ సర్కిల్ ఇంచార్జ్ సంచాలకులు రాజగంగారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్షను నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాలలో ఈనెల 9న నిర్వహిస్తామని పేర్కొన్నారు. 100 ప్రశ్నలు కలిగిన జనరల్ స్టడీస్ పరీక్ష, 40 ప్రశ్నలు కలిగిన సి-శాట్ పరీక్ష సమయం మూడు గంటలు అని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి 10 గంటల నుంచి అనుమతిస్తారని, పరీక్ష ప్రారంభమైన 10.30 నిమిషాల పిదవ అనుమతించరని పేర్కొన్నారు. ఓఎంఆర్ ఆన్సర్ షీటులో గడులను నింపేందుకు బ్లాక్ బాల్‌పెన్‌ను అభ్యర్థులు తమతో తీసుకుని రావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షకై దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకునేందుకు స్టడీసర్కిల్ వెబ్ సైటు www.tsstudycircle.co.in ను సందర్శించాలని పేర్కొన్నారు.

విజయ్ విద్యార్థికి ఇన్‌స్పైర్స్ క్యాష్ అవార్డ్

నవతెలంగాణ-ఆర్మూర్



విద్యార్థితో ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి ఇన్స్పైర్స్ అవార్డు 2023-24 విద్యాసంవత్సరానికి ముందస్తు ప్రిపరేషన్ నిమిత్తం పట్టణంలోని విజయ్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి సుక్రిత్ రెడ్డి క్యాష్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ కవిత దివాకర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం డాక్టర్ అమృతలత, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్ వితరణ



పెన్నులు. పెన్సిళ్లు అందజేసిన ఎన్ఆర్ఐ

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని అమ్రాద్ తండాకు చెందిన ఎన్ఆర్ఐ మూడ్ గంగారాం నాయక్ ఆధ్వర్యంలో తన కుమారుడు మూడ్ గంగాసాగర్ తన పుట్టిన రోజు సందర్భంగా స్వగ్రామంలోనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్, పెన్సిల్, పెన్నులు విద్యార్థులకు బుధవారం అందజేశారు. ముఖ్య అతిథిగా మాక్లూర్, ఆర్మూర్ మండలం బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనీ, తల్లిదండ్రులు, ఊరిపేరు నిలపాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఆర్ఐ గంగారాం నాయక్ మరెన్నో మంచి సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులకోసం 10 నుండి టోకెన్ సమ్మె

- ఎంఈఓలకు నోటీసుల అందజేత
- జయప్రదం చేయండి ఎండీఎం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి

ఈనెల 10 11 12 తేదీల్లో నిర్వహించే టోకెన్ సమ్మె చేపడుతున్నట్టు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల విద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మండల కార్యదర్శి తాల్లపల్లి స్వప్న మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన కార్మికులకు 3000 రూపాయల వేతనాన్ని పెంచుతూ సర్క్యులర్ విడుదల చేసినప్పటికీ ఇప్పటికీ చెల్లించలేదని, 8 నెలల నుండి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అన్నారు. మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, మల్యాల గోవర్ధన్, మండల నాయకులు రాజా గౌడ్, సిహెచ్ రూప, సంధ్య, లక్ష్మీ పద్మ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: సమ్మెనోటీసులు అందజేస్తున్న కార్మికులు

డిచ్‌పల్లి: తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) డిచ్ పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల విద్యాధికారికి సమ్మె నోటీస్‌ను అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షురాలు హరిత, నాయకురాలు ఈశ్వరి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10 ,11, 12 తేదీలలో వంట బంద్ చేసి రాష్ట్ర వ్యాప్తంగా టోకెన్ సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, మల్యాల గోవర్ధన్, మండల నాయకులు గోవింద్, షబానా, కోమలి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులందరికీ పోడుపట్టాలు ఇవ్వాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

పోడు భూములను సాగు చేస్తున్న ప్రతి ఒక్కరికి పట్టాలివ్వాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అమ్రాబాద్, కల్పోల్ గ్రామాల్లో బుధవారం ఆయన పోడు భూములను పరిశీలించి పట్టాలు రాని గిరిజనులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పోరాటాలతోనే ఈ మాత్రం గిరిజనులకు పట్టాలు వచ్చాయని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అప్పుడు పట్టాలు రాని ప్రతి ఒక్కరికీ హక్కు పత్రాలు ఇస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ పాలనలో కమిషన్ల దందా కొనసాగిందని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించడం తగదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎక్కడైనా కమిషన్లు తీసుకున్నట్టు నిరూపిస్తే తను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, నిరూపించకపోతే పోడు భూముల పంపిణీ చేసిన గ్రామాల్లో ఎమ్మెల్యే ఓట్లు అడగవద్దని సవాల్ చేశారు. అమ్రాబాద్‌లో నూట పది ఎకరాల అసైన్డ్ 51 సర్వేనెంబర్ గల భూమిని ధరణిలో లేకుండా చేశారని, గ్రామంలో చాలావరకు భూములను ధరణిలో లేకుండా చాలా సర్వే నెంబర్లు ఉన్నాయని బాధితులు నగేష్ రెడ్డి ముందు వాపోయారు. బూన్నే రవీందర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ యాదగిరి మాట్లాడుతూ, గిరిజన సోదరులలో కొందరికి 5 నుంచి 6 ఎకరాలు సాగు చేసుకుంటే ఒక్కొక్క రైతుకు ఆరు గుంటలు, 10 గుంటలు, 15 గుంటలు అంటూ పట్ట భూమి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మోపాల్ మండల్ వైస్ ప్రెసిడెంట్ సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ ఖేత్ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, వేల్పూర్ కిషన్, తదితర రైతులు పాల్గొన్నారు.




పోడు భూములు పరిశీలించేందుకు వెళ్తున్న నాయకులు

తాగునీటికోసం అలీ సాగర్ నీటి విడుదల

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని కోస్లి పంప్ హౌస్ వద్ద అలీ సాగర్ నీటిని ఇరిగేషన్ ఏ ఈ ఈ ప్రణయ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. నిజామాబాద్ పట్టణ త్రాగునీటి అవసరాల కోసం అలీ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నది నుండి నాలుగు, ఐదు రోజులపాటు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.అనంతరం కాళేశ్వరం లేదా వరద నీరు వచ్చిన తర్వాత సాగునీటికై ఎమ్మెల్యే షకీల్ అమీర్ నీటిని విడుదల చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.



సృజనాత్మకతను ప్రోత్సహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

(టిఎస్ఐసీ), రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలో ఆవిష్కరణలను, సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టిఎస్ఐసీ) నిర్వహించే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం 5వ విడత కార్యకలాపాల కరపత్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా గుర్తించిన ఆవిష్కరణలను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రదర్శనకు ఉంచుతారని తెలిపారు. అన్ని రంగాల, వర్గాల నుండి వచ్చే ఆవిష్కరణలు ఈ ప్రదర్శనలో పాల్గొనవచ్చు. తమ ఆవిష్కరణకు సంబంధించిన ఆరు వాక్యాలు, రెండు నిమిషాల వీడియోను, ఆవిష్కరణ, నాలుగు ఫోటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నెంబర్, వయస్సు, ప్రస్తుత వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరు వంటి వివరాలు 9100678543 కి వాట్సాప్ చేయాలని తెలిపారు. చివరి తేదీ 5 ఆగస్టు అని తెలిపారు. మొదటి స్క్రూటినీ తరువాత జిల్లాకు ఐదు ఆవిష్కరణలు ప్రదర్శనకు ఎంపిక చేస్తారని వివరించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లు

- ప్రతి డివిజన్‌లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే గణేష్ బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర సుందరీకరణనే లక్ష్యమని, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశామని, అభివృద్ధి సంక్షేమం తనకు రెండు కన్నులని, హరిత ప్రగతికి నిజాంబాద్ నగరానికి అవార్డులు వచ్చాయని, నేటి నుండి ప్రతి డివిజన్లో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తామని అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా తెలిపారు. బుధవారం 39 వ డివిజన్‌లో కార్పొరేటర్ లత కృష్ణ అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. కోటి రూ.లతో నిర్మిస్తున్న డ్రైనేజీ, బిటి రోడ్డు, సీసీ రోడ్డు పనులని భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆదర్శ్ నగర్ కాలనీ, న్యూ ఎన్జీవోఎస్ కాలనీ, ఓల్డ్ ఎన్జీవోఎస్ కాలనీ, అంబేద్కర్ కాలనీలో కాలి నడకన ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుండి సమస్యలు తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాశ్, పూజిత ప్రవీణ్ గౌడ్ ,మున్సిపల్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, ఎలక్ట్రిసిటీ అధికారులు పాల్గొన్నారు.

కూలీలకు బలవర్ధక పానీయాల అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం కూలీలకు బిస్కెట్ ప్యాకెట్లు, బలవర్ధక పానీయాలను పంపిణీ చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రెటరీ కట్ట మహేష్, ట్రెజరర్ జక్కుల రాము, సభ్యులు శంకర్, దినేష్, లోక నర్సయ్య, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



పానీయాలు అందజేస్తున్న సభ్యులు

కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆమోదం మేరకు పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు ఆర్గనైజేషన్ ఇంచార్జ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం 29 మండలాలకు మండల కాంగ్రెస్ అధ్యక్షులను, మూడు టౌన్‌లకు అధ్యక్షులను నియమించినట్లు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల మోహన్ రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్లను విడుదల చేశారు. ఈ నియామకాలు వెంటనే అమలులోకి వస్తాయని తెలిపారు.

నేడు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం జరుగుతుందని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీహరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జునోటిక్ వ్యాధులలో అత్యంత ప్రమాదకరమైన రేబిస్ వ్యాధి నివారణకు ఈనెల 06 నుండి నిజామాబాద్ జిల్లా కోటగల్లి లోని జిల్లా పశు వైద్యశాలలో, మున్సిపల్ పరిధిలో ఏరియా పశు వైద్యశాలలు, మండల పశు వైద్యశాలలో ఉచితంగా యాంటి రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు పెంపుడు జంతువుల యజమానులు వినియోగించుకోవాలని కోరారు. జులై 6 న పశువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులు (జునోటిక్ వ్యాధులు) వాటి నివారణ దినోత్సవంగా (జునోసిస్ డే) నిర్వహించడం జరిగుతుందని తెలిపారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- నేడు ప్రపంచ జూనోసిస్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

పెంపుడు కుక్కలు, ఊర కుక్కలతో మనుషులు జాగ్రత్తగా ఉండాలి. పెంపుడు కుక్కల కారణంగా చాలామంది ప్రమాదాల బారిన పడ్డ సంఘటనలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాల్లోనూ పెంపుడు కుక్కలను పెంచే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రఖ్యాత ఫ్రెంచ్ బయాలజిస్ట్ లూయిస్ ఫ్యాశ్చర్ 1885 జూలై 6న కుక్క కాటుకు టీకాను కనుగొన్నారు. ఒక బాలుడికి కుక్క కాటు వేయగా టీకా వేశారు. యాంటీ రేబిస్ టీకాగా ప్రాచుర్యం పొందిన ఈ టీకాను నేడు ప్రపంచవ్యాప్తంగా పెంపుడు కుక్కలు, ఊర కుక్కలకు వాక్సినేషన్ చేస్తున్నారు. ఈరోజు పపంచ జూనోసిస్ డే నిర్వహిస్తున్నారు.

జూనోటిక్ వ్యాధుల గురించి...

పశువు, పక్షుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులను ముఖ్యంగా ఊర కుక్కలు,పెంపుడు కుక్కల నుంచి రేబిస్ వ్యాధి బ్రుస్సొల్లి సీస్, అంత్రిక్స్, కోళ్ల నుంచి వ్యాపించే బర్డ్ ఫ్లూ లాంటి ప్రమాదకరమైన జూనోటిక్ వ్యాధులు వస్తాయి. ఈ వ్యాధులపై అవగాహన కలిగి వాటిని అరికట్టడంలో అందరూ భాగస్వాములై ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పశువుల ఆరోగ్య పరిరక్షణకు పాటు పడాల్సిన అవసరం ఉంది.

పిచ్చికుక్క కాటు వ్యాధి గురించి.....

సూక్ష్మజీవి వైరస్ ద్వారా సంక్రమించే భయంకరమైన ప్రాణాంతకమైన వ్యాధి రేబిస్. ఈ వ్యాధి సోకిన కుక్కలు మనుషులకు పశువులకు ఇతర కుక్కలకు కరవడం ద్వారా వాటి లాలాజలంలో ఉండే వైరస్ క్రిములు శరీరంలోకి ప్రవేశించి ఈ రేబిస్ వ్యాధిని వ్యాప్తి చేస్తాయి.



కుక్కలలో రేబిస్ లక్షణాలు..

నోటి నుంచి చెంగ కారుతూ నాలుక బయట పెట్టడం, మతి లేకుండా పిచ్చిపిచ్చిగా తిరగడం యజమానిని గుర్తించకపోవడం, కనపడిన ప్రతి వస్తువును పశువులను, ఇతర కుక్కలను మనుషులను కరవడం జరుగుతుంది. అరుపుల్లో మార్పు గమనించవచ్చు. పది రోజుల్లో కుక్కలు చనిపోతాయి. కొన్నిటిలో తిండి తినకపోవడం ఒకచోటే నిశ్శబ్దంగా పడుకొని ఉండడం, లేదా ఇల్లు వదిలి పారిపోవడం, పక్షపాతం వచ్చి మూడు రోజుల్లో చనిపోవడం కూడా లక్షణాల్లో ఉన్నాయి.

పశువుల్లో..

గేదెలు, ఆవులు సొల్లు కార్చడం, తలను గోడకు చెట్టుకు గుద్దుకోవడం తరచుగా మూత్రం పోయడం, గట్టిగా అరవడం జ్వరంతో బాధపడుతూ కనుగొడ్లు తిప్పడం, మేత మేయడం నీరు తాగలేక భయంతో చనిపోవడం జరుగుతుంది..

మనుషులలో రేబీస్ వ్యాధి లక్షణాలు..

శరీర కండరాలలో విపరీతమైన నొప్పి నీళ్లను చూసి భయపడడం. ప్రవర్తనలో మార్పు, శ్వాస తీసుకోవడం కష్టమై 10 రోజుల్లో మనిషి చనిపోతాడు. పిచ్చికుక్క కాటు వల్ల వ్యాధికారక వైరస్ మనిషి శరీరంలోకి ప్రవేశిస్తుంది. కుక్క కాటుకు గురైన మనుషులకు పశువులకు తప్పనిసరిగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు డాక్టర్ పర్యవేక్షణలో వేయించాలి.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి..



పెంపుడు కుక్కలకు పశు వైద్యులతో వారి సూచనలు, సలహాలతో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ఊర కుక్కలకు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ వారి సహకారంతోనే రేబిస్ టీకాలు వేయించాలి. వ్యాధి సోకిందనే అనుమానం ఉన్న కుక్కలను దూరంగా ఉండేటట్లు చేయాలి. రేబిస్ వ్యాధితో చనిపోయిన జంతువులను తప్పకుండా కాల్చివేయాలి. కుక్క సంచరించిన పరిసరాలను దాని పడకను ఆహార పాత్రలను క్రిమి సంహారక మందులతో తరచూ శుభ్రపరచాలి.

లక్కం ప్రభాకర్, మండల పశు వైద్య అధికారి ఆర్మూర్

మండల సమైక్య సమావేశం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద, బాన్సువాడ, పిట్లం, బీర్కూర్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, జుక్కల్, నసురుల్లాబాద్ ఎనిమిది మండలాల మండల సమాఖ్య సిబ్బంది రివ్యూ సమావేశం బిచ్కుంద మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ జిల్లా పథక సంచాలకులు ప్రతి మండల సిబ్బంది క్లస్టర్ వారిగా రివ్యూ నిర్వహించారు. సంస్థాగతంగా నిర్మాణంలో చిన్న సంఘాల పుస్తక నిర్వహణ, సంఘం పొదుపు, అప్పులు, బ్యాంకు లింకేజ్ గ్రౌండింగ్ ఏస్పీయే సక్రమమైన వాయిదాలలో చెల్లింపులు చరవాణిలో సంఘ సమాచారం నిక్షిప్తం చేయడం, జీవనోపాధి గుర్తింపు, వారి ఉపాధి అవకాశాలు పెంపొందించే విధంగా చూడాలని అన్నారు. సమావేశంలో ఏడీఐ పీడీ మురళి, డీపీఎం సుధాకర్, రవీందర్, రమేష్ బాబు, వకుల, సురేష్, ఏటీఎమ్‌లు రాజిరెడ్డి, నాగరాజు, పద్మ, శిరీష, గంగాధర్, మనోహర్, రవీందర్, సత్యనారాయణ, గంగాధర్ ఎనిమిది మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండల కేంద్రంలో బుధవారం వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరంలో నసురుల్లాబాద్ మండల పరిధిలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ డాక్టర్ మనీషా చికిత్స చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాన్లు, శిబిరం నిర్వాహకుల సిబ్బంది, సురేష్, రూప, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేలకు సత్తువ

- పచ్చిరొట్ట పెంచి పొలంలో కలియదున్నాలి
- తద్వారా ఎన్నో ప్రయోజనాలు

నవతెలంగాణ-రామారెడ్డి


రామారెడ్డి మండలంలో సాగుచేసిన జీలుగ

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించినప్పటికీ పంటల సాగులో విచక్షణా రహితంగా వినియోగించే రసాయనాల ద్వారా అనేక అనార్థాలు సంభవిస్తున్నాయి. నేల భౌతిక లక్షణాలు దెబ్బతిని నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని క్రమంగా కోల్పోతున్నాయి. సూక్ష్మపోషక లోపాలు తరచుగా కనబడుతున్నాయి. ఉత్పాదకత తగ్గి, ఖర్చు పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో నేల సహజత్వాన్ని కాపాడుతూ అధిక దిగుబడులు సాధించేందుకు పచ్చిరొట్ట పైర్లు ఎంతగానో సహకరిస్తాయి. పచ్చిరొట్ట ఎరువులు తేలికగా చివికి పోయే స్వభావం కలిగే నేలకు సత్తువను చేకూర్చే పంటలు కానీ, అటువంటి లక్షణాలు గల పంటల ఆకులను గానీ పచ్చిరొట్ట ఎరువులు అంటారు.

పచ్చిరొట్ట పంటల సాగు

పచ్చిరొట్ట పైర్లను పొలంలో చల్లి అవి పెరిగాక అదే పొలంలో కలియదున్ని పంట వేసుకోవడం. ఉదా:జీలుగు, జనుము, పిల్లి, పెసర, అలసంద, వెంపల్లి, ఉలవ, పెసరు.

పచ్చిరొట్ట పైర్లు.. లక్షణాలు

త్వరగా ఎదిగి ఎక్కువ ఆకులు, పచ్చికాండం ఇవ్వగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. మొక్క భాగాలు మృదువుగా, పెళుసుగా, రసపూరితంగా ఉండి త్వరగా కుళ్ళే స్వభావం కలిగి ఉండాలి. అన్ని రకాల నేలలు, వాతావరణ పరిస్థితులు, నీటి ఎద్దడిని తట్టుకునే సామర్థ్యం కలిగి, పప్పుజాతికి చెందిన మొక్కలై ఉండాలి. విత్తనం తక్కువ ధరకు మార్కెట్‌లో లభ్యం అయ్యేదిగా ఉండాలి.

పచ్చిరొట్ట పంటలు, విత్తే సమయం, జాగ్రత్తలు..

పచ్చిరొట్ట పైర్లను మే, జూన్ లేదా తొలకరి వర్షాలు మొదలైనప్పుడు నాటుకోవచ్చు. పచ్చిరొట్ట దిగుబడి, నత్రజని స్థిరీకరణ పచ్చిరొట్ట, పైరు దశ మీద ఆధారపడి ఉంటుంది. సాధారణ దిగుబడి రావడానికి 45 రోజుల సమయం పడుతుంది. పూత దశలో కలియదున్నడం వల్ల అత్యధిక సత్తువను చేకూరుస్తుంది. రోటావేటరు లేదా పవర్ టిల్లర్ సహాయంతో కలియదున్నుకోవచ్చు. నత్రజని వృధాగా పోకుండా ఉండటానికి కనీసం 15 నుంచి 22 సెం.మీ. లోతులో కలియదున్నాలి. మురుగునీరు పోయే సౌకర్యం లేని వరి పొలాల్లో పచ్చిరొట్ట కుళ్ళుతున్నప్పుడు మధ్యలో తయారయ్యే కొన్ని వాయువులు అప్పుడే నాటిన వరి మొక్కలకు హాని కలిగిస్తాయి. కావున కలియదున్నిన 2 వారాల తర్వాత మాత్రమే నాట్లు వేసుకోవాలి.

పచ్చిరొట్ట పైర్లు ప్రయోజనాలు

పచ్చిరొట్ట పైర్లు నేలలో కుళ్ళేటప్పుడు జరిగే రసాయన ప్రక్రియల వల్ల భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు సులభంగా లభ్యమవుతాయి.పచ్చిరొట్ట పైర్లు సాగువలన నేల భౌతిక లక్షణాలు వృద్ధి చెందటమే కాకుండా నత్రజని ఎరువుల వాడకాన్ని 25-30 శాతం వరకు తగ్గించవచ్చు.నేల నీటి నిల్వ సామర్థ్యం వృద్ధి చెందడంతో పాటు నేల కోతను కూడా అరికడుతుంది. పచ్చిరొట్ట ఎరువులు సేంద్రీయ ఎరువులు. నీటి ద్వారా నేలలో మేలు చేసే సూక్ష్మ జీవుల వృద్ధి చెంది మొక్కలకు రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు నేల ద్వారా సంక్రమించే తెగుళ్ళను అరికడుతుంది. భూమి గుల్లబారి పంట మొక్కల వేర్లకు అవసరమయ్యే గాలి, నీరు పుష్కలంగా అందుతాయి. దీర్ఘకాలిక పంటల్లో, పండ్లతోటల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పూత దశలో కలియదున్నడం వల్ల నేల సారవంతం అవుతుంది. చౌడు సమస్యను తొలిగించడంతో పాటు భూసార పరిరక్షణకు తోడ్పడతాయి.

ముఖ్యంగా వరి సాగు చేసే ప్రాంతాలలో వరి పంట ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల ముందు పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల బియ్యంలో విటమిన్లు, మాంసకృత్తుల శాతం పెరిగినట్లు పరిశోధనా ఫలితాలలో వెల్లడైంది. దిగుబడి కూడా దాదాపు 15-20 శాతం పెరుగుతుందని రుజువైంది. అందువలన రైతులు సరైన పచ్చిరొట్ట పైర్లను మార్కెట్ లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేసుకొని సాగు చేసుకోవడం శ్రేయస్కరం.

జీపీ కార్మికుల సమ్మె నోటీస్ అందజేత


వినతిపత్రం అందజేస్తున్న నూర్జహాన్

నవతెలంగాణ-కోటగిరి

మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్మికులు బుధవారం నిరవధిక సమ్మెలోకి దిగుతున్నట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారికి తెలిపారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. 50వేల మంది కార్మికులు ఉద్యోగ భద్రత లేకుండా జీవనం కొనసాగిస్తున్నారని వారికి శాశ్వతమైన పరిష్కారం లభించాలని నూర్జహాన్ పేర్కొన్నారు. ఇందుకు అధికారులు సహకరించాలని వారు డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

నవతెలంగాణ-రెంజల్

మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరుతూ రెంజల్ మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహకులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. జులై 10,11,12వ తేదీలలో వంటలను బంద్‌పెట్టి టోకెన్ సమ్మెకు దిగుతున్నట్టు మధ్యాహ్న భోజన ఏజెన్సీ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి పేర్కొన్నారు. జీవో నెంబర్ 8 ప్రకారం ఏరియాస్‌తో సహా బకాయిలు చెల్లించాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, అక్రమ తొలగింపులను నిలిపివేస్తూ రాజకీయ వేధింపులను ఆపాలని, కార్మికులకు కాటన్ యూనిఫామ్ అందజేయాలని డిమాండ్ చేస్తూ వారు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సుమీద, స్వరూప, ప్రియా, అశోక్, శిరీష, రెహనా బేగం, మంగమ్మ, కాశం సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎంపీడీవో విజయ్ కుమార్

నవతెలంగాణ-రామారెడ్డి

వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా, గ్రామాల్లోని కాలనీలో నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీలను శుభ్రపరుస్తూ, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్, రసాయనాలను పిచికారీ చేయాలని ఎంపీడీవో విజయ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ సవిత మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమాన్ని ప్రతి గ్రామపంచాయతీ విజయవంతం అయ్యేలా కృషి చేయాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని, సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ధర్మారెడ్డి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపక యూనిట్‌ను ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

మండలంలోని కల్యాణి గ్రామంలో ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ చేపల పేపకం యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. కళ్యాణి గ్రామ సంఘం రూ.3,20,000ల ఋణ సహాయంతో ఎర్పుల సుమలత ఏర్పాటు చేసుకొన్న చేపల పెంపకం యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యువత సంప్రదాయ వ్యవసాయంతో పాటు ఆక్వా కల్చర్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రఘువీర్ గౌడ్, ఎంపీటీసీ శ్రీధర్‌గౌడ్, ఉప సర్పంచ్ నారాగౌడ్, జడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంపీవో ప్రకాష్, డీపీఎంలు రమేష్ బాబు, రవీందర్ రావు, సురేష్, ఏపీఎంలు ప్రసన్నరాణి, రాజిరెడ్డి, సీసీలు సంధ్య, సుజాత, సావిత్రి, గోపాల్, చీను, రవి, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బోధన్

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖాధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఏఎస్‌బీ విద్యార్థి సంఘం నాయకులు బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో పాలనాధికారి ముంతాజుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలలో విద్యార్థుల నుంచి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అలాంటి విద్యా సంస్థలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. పాఠ్యపుస్తకాలు, బెల్టు, డ్రెస్సెస్, అడ్మిషన్ ఫీజు అంటూ అనేక రూపంలో ఫీజులు వసూలు చేస్తున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాజన్న, గంగాప్రసాద్, శీను, ప్రకాష్, జయరాం, సురేష్ పాల్గొన్నారు.

టీ హబ్‌లో భిక్కనూర్ విద్యార్థుల ప్రదర్శన

నవతెలంగాణ-భిక్కనూర్


యాప్ గురించి వివరిస్తున్న విద్యార్థులు

హైదరాబాద్‌లోని టీ హబ్‌లో జరిగిన స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో మొదటి 15 పాఠశాలల ప్రదర్శనలో విద్యాశాఖ ద్వారా ఎంపికైన రాష్ట్రంలోని 15 మొదటి అత్యున్నత పాఠశాలల జాబితాలో భిక్కనూర్ పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల చోటు సంపాదించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పాల్గొని హెల్త్ సర్వీస్ యాప్‌ను ప్రదర్శించారు. యుఎన్‌ఐసిఈ ప్రతినిధులు హాజరై విద్యార్థులు తయారుచేసిన యాప్ గురించి వివరాలు అడిగి తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల వెంట సైన్సు ఉపాధ్యాయులు బాలగంగాధర్, సరిత, వెళ్లారు. టీ హబ్ లో హెల్త్ సర్వీస్ యాప్ గురించి ప్రదర్శించిన విద్యార్థులను జిల్లా విద్యాధికారి రాజు, సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, అధ్యాపకులు అభినందించారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్

నవతెలంగాణ-రామారెడ్డి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాలైన ఇల్లు, ఖాళీ స్థలాలు లేని ప్రజలకు వెంటనే 200 గజాల ఖాళీ స్థలం, డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేయాలని డిమాండ్ చేశారు. జీవన ఉపాధి కోసం పోడు భూముల్లో వ్యవసాయం చేస్తున్న ప్రతి ఒక్కరికి పట్టాలు అందించాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, అర్హులైన బీడీ పింఛన్లను, ఆసరా, వికలాంగుల పింఛన్లను వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బాలరాజ్, మండల కార్యదర్శి శ్యామల, నాయకులు పుష్పలత, మనమ్మ, సావిత్రి, భారతి, సత్యవ్వ, వాణి, రాజమణి, గంగారం, కల్పన, మల్లయ్య, లక్ష్మీపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పేద బడుగు బలహీన వర్గాలు, రైతుల అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యమని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.4వేల ఆసరా పింఛన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి, పశుపతి, మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రైతులకు రుణమాఫీ, కరెంట్ బిల్లుల మాఫీ, పోడు పట్టాలను అందజేసి రైతులను ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంతమంది వయోవృద్ధులు ఉన్నా, వికలాంగులు, ఒంటరి మహిళలు ఉన్న ప్రతి ఒక్కరికి, ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఒక్కరికి ఆసరా పింఛన్ అందిస్తుందని అన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకరిద్దరికి దళిత బంధు ఇచ్చి, మిగతా వారందరికీ గొడవలు సృష్టిస్తుందని, నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇస్తానని హామీ ఇచ్చి ఒకరికి ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వమే, ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగిస్తుందని, కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను, మాటలను నమ్మవద్దని, రైతులకు ఏకకాల రుణమాఫీ చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట కిషన్, చింతకుంట ఎల్లయ్య, తూర్పు సుబ్బన్న, నామాల రవి, బిట్ల నర్సింగరావు, బీపేట నర్సింలు, ఇస్సన్నపల్లి భైరయ్య, బండి పోచయ్య, గణేష్, జగన్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబ పరిస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని 27వ వార్డుకు చెందిన రమాదేవి తన దీనస్థితిపై ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం ఆర్డీఓ రాజేశ్వర్‌కు రోదిస్తూ తన పరిస్థితి వివరించింది. తనకు ఇల్లు లేదని, అద్దె ఇంట్లో ఉంటున్నామని, తన ఇద్దరు పిల్లలు చదువు మానేసి మేస్త్రీ పనికి పోతున్నారని, తన సంబంధికులకు చెందిన మరో ఇద్దరు అనాథ పిల్లలను తానే చూసుకోవలసి వస్తుందని, దాంతో పలు ఇళ్లలో పాచి పని చేస్తూ ఫర్నీచర్ షాపులో పనిచేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని పేర్కొన్నారు. తన భర్త అనారోగ్యంతో ఉండడంతో కుటుంబ భారం తానే మోయవలసి వస్తుందని తన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని ఆర్డీఓకు తన కష్టాలను వివరించింది. ఆమె ఇబ్బందులపై వివరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ స్పందించారు. తక్షణమే పార్టీ కార్యకర్తలను నిరుపేద మహిళ రమదేవి ఇంటికి పంపి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దాంతో బుధవారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కృష్ణ బాధిత నిరుపేద మహిళ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. తన సమస్యపై స్పందించిన ఎమ్మెల్యేకు నిరుపేద మహిళ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పైప్‌లైన్ ఏర్పాటు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థుల కోసం పైపులైన్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల మెరుగైన సౌకర్యం కోసం నల్ల వాటర్ ట్యాప్‌ను గ్రామపంచాయతీ నిధులతో వార్డు మెంబర్ మోసార్ల శ్రీకాంత్‌రెడ్డి వాటర్ ట్యాప్‌ను సమకూర్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఎప్పుడైనా తనవంతు సహాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పయ్యావుల నరేందర్, కలిగొట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ తండా అంగన్వాడీ కేంద్రం సందర్శన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్ తాండ అంగన్వాడీ కేంద్రంలో తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీలో ఉన్న చిన్నారులను ప్రైవేట్ పాఠశాలలకు వద్దని ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేస్తుందని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బీసీ కులవృత్తి, చేతివృత్తిదారుల దరఖాస్తుల పరిశీలన

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని కొండాపూర్ గ్రామంలో రూ.లక్ష ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ కులవృత్తి, చేతివృత్తిదారుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు మండల అభివృద్ధి అధికారి బాలకిషన్ బుధవారం పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి, కొండాపూర్ సర్పంచ్ స్వాతి, పంచాయతీ సెక్రెటరీ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సభావాత్ వినోద్ నాయక్ బుధవారం స్థానిక విద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ప్రయివేటు హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని, గుర్తింపు రద్దు చేయాలని అన్నారు. ఒక ప్రేవేటు హైస్కూల్ 60,70 మంది విద్యార్థులతో విద్యాబోధన రేకుల షెడ్యూల్లో జరుగుతుందని, వీటిపై ఎంఈఓ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

9న గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 9న ఆదివారం గౌడ జాతి విద్యార్థినీ విద్యార్థులకు జరిగే ప్రతిభా పురస్కారాల అవార్డు ఫంక్షన్‌కు భారీ ఎత్తున గౌడ జాతి విద్యార్థిని విద్యార్థులు తరలిరావాలని జై గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు బుంబోతుల లింగాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగోల మురళి గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని విజయదుర్గా రెస్టారెంట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పదవ తరగతిలో 10/10 జీపీఏ సాధించిన గౌడ విద్యార్థిని విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయి 20వ ర్యాంకు లోపు సాధించిన విద్యార్థినీ విద్యార్థులు తమ పేర్లను 9440760879, 9492874011, 9177842777, 7981421185, 9640007129 నంబర్లకు తమ వివరాలను పంపించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి జై గౌడ సంఘం జాతీయ అధ్యక్షులు వట్టికూడి రామారావు గౌడ్, ఉద్యమ సంఘాల నేత చక్రవర్తి గౌడ్ జై గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలు అనురాధ గౌడ్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జై గౌడ సంఘం జిల్లా ముఖ్య నాయకులు బండారి సాయిరాంగౌడ్, రవికుమార్‌గౌడ్, ముగ్గుల్ల రామాగౌడ్, అంకన్నగారి శ్రీనివాస్‌గౌడ్, ఇందూరి సిద్ధాగౌడ్, బొంబోతుల నరేష్‌గౌడ్, కర్రోల్ల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయ దారులకు ఆర్థిక తోడ్పాటు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణంలోని వీధి విక్రయదారులతో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. వీధి విక్రయ దారుల ఆర్థిక తోడ్పాటుకు గత సంవత్సరం రూ.10వేలు రుణం ఇచినట్లు తెలిపారు. లోన్ సక్రమంగా కట్టుకున్నవారికి తిరిగి లోన్ ఇస్తామని రెండవ మూడవ సారి తీసుకున్న వారికి 20 వేలు లేదా 50 వేల వరకు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, పలు బ్యాంకు మేనేజర్‌లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

ఏఎస్ఐ ప్రకాశ్

నవతెలంగాణ-లింగంపేట్

ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లింగంపేట్ ఏఎస్ఐ ప్రకాశ్ ప్రజలకు సూచించారు. బుధవారం లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఆన్లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఎవరైనా ఫోన్‌లో సమాచారం అడిగితే ఆధార్ కార్డ్ బ్యాంక్ ఖాతా నెంబర్ ఇవ్వవద్దని సూచించారు. ప్రజలకు స్కీముల పేరి ఆన్లైన్ మోసాలు జరుగుతున్నాయని, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దని తెలిపారు. అదేవిధంగా తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అతివేగంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగురత దివస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధి లోని సోషల్ వెల్ఫేర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాబృందం ,ఎస్సై రాము మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల మాటలే పెట్టుబడి మోసమే వ్యాపారం కాబట్టి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పార్ట్ టైం జాబ్స్, లోన్ ఫ్రాడ్స్, లక్కీ లాటరీ తదితర వాటిపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆన్లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. దీనికి సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1930 చేయాలని, ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. బైక్ పై ప్రయాణించే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం, కళాశాల ప్రిన్సిపాల్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ అమలు చేయాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూటి ప్రశ్న

నవతెలంగాణ-వర్ని

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో లక్ష రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతులను మోసం చేసి ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి విట్టల్ ఆరోపించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సీఎం కేసీఆర్ రుణమాఫీని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మూతబడ్డ చక్కెర పరిశ్రమలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే తెరిపిస్తామని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ కుటుంబం నోరు మెదపకపోవడంలో ఆంతర్యం ఏమిటని నిజామాబాద్ రైతన్నలకు కేసీఆర్ తీరని అన్యాయం చేశారని విట్టల్ విమర్శించారు.

బిచ్కుందలో వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన దేవర్ షెట్టి సంతోష్ (35) తన ద్విచక్ర వాహనంపై మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి దేవర్ శెట్టి అశోక్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. దేవరశెట్టి సంతోష్ ఆచూకీ లభించిన వారు 8712686176, 9848282915,9949010236 నెంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎడపల్లి మండలాధ్యక్షులుగా పులి శ్రీనివాస్‌రావు



నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షులుగా పులి శ్రీనివాసరావు నియామకమైనట్లు కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏఆర్పి క్యాంప్ గ్రామానికి చెందిన పులి శ్రీనివాస్‌రావు ఎడపల్లి జెడ్పీటీసీగా పదవులు నిర్వహించారు. రాజకీయ రంగంలో పులి శ్రీనివాసరావుకు మంచి పేరు ఉంది. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అనుచరుడు. ఏఆర్‌పీ క్యాంప్ గ్రామ సర్పంచ్‌గా, ఎడపల్లి మండల జెడ్పిటిసిగా రాజకీయంలో రాణించారు.

కౌలాస్ జిల్లా పరిషత్ పాఠశాలకు ఆట వస్తువులు వితరణ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆటలు ఆడుకోవడానికి రూ.5వేల గల విలువైన వాలీబాల్ కిట్, నెట్‌ను డిస్ట్రిక్ కామన్ ఎక్సామినేషన్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి (డీసీఈబీ) సీతయ్య స్వంత ఖర్చులతో బుధవారం వితరణ చేసినట్టు జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హీరాజాదవ్ తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాతో సీతయ్యను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆట వస్తువులు వితరణ చేస్తున్న దృశ్యం

మగ్గం వర్క్ మొదటి బ్యాచ్ కేంద్రాన్ని ప్రారంభించిన పీడీ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఇందిరాక్రాంతి పథకంలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో మగ్గం వర్క్ బ్యాచ్‌ను కామారెడ్డి జిల్లా డీఆర్డీఏ పీడీ సాయన్న బుధవారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించినట్టు జుక్కల్ ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జుక్కల్ సర్పంచ్ బొంపెలి రాములు, విండో చైర్మెన్ శివానంద్, నాయకులు నీలు పటేల్, దాదారావ్ పటేల్, ఎంపీడీవో నరేష్, ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ, సీసీలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



బ్యాచ్‌ను ప్రారంభిస్తున్న పీడీ

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని హాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కట్ట కింద తాండలో ఎంపీపీ మాధవి బలరాజ్‌గౌడ్ సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉషగౌడ్, సర్పంచ్, కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీలలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ సెక్రటరీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల వార్డులలో నీటి నిల్వలు దోమలు అభివృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలితే మండల అభివృద్ధి కార్యాలయానికి రిపోర్టు చేయాలని సూచించారు. చెత్త బండి మైకు ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీలలో ఫాగింగ్ ద్వారా దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల గురించి స్కూల్స్, హాస్టల్స్, అంగన్‌వాడీ, హెల్త్ డిపార్ట్మెంట్‌ల సహకారంతో ప్రజలను చైతన్య పరచాలన్నారు. గత సంవత్సరము వ్యాధులు ప్రబలిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, ఏపీవో శివ, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వర్షపు నీటితో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జ్

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని తలమడ్ల, శివాయిపల్లి గ్రామంలో గల రైల్వే అండర్ బ్రిడ్జ్ మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నీటితో నిండిపోయింది. తలమడ్ల అండర్ బ్రిడ్జ్ పనులు జరుగుతున్నప్పటికీ వాహనాదారులను దారి మళ్లించినప్పటికీ ఆ మార్గాలు పూర్తిగా బురదమయం కావడంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. శివాయిపల్లి అండర్ బ్రిడ్జ్‌లో నీరు నిలవడంతో పాఠశాల విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. అధికారులు స్పందించి నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అండర్ బ్రిడ్జ్ వద్ద చేరిన నీరు

రూరల్‌లో కొత్తగా ఒక్క ప్రాజెక్ట్, ఆస్పత్రి తెచ్చారా?

- మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రూరల్ నియోజకవర్గంలో కొత్తగా ఒక్క ప్రాజెక్టునైనా, ఆసుపత్రినైనా తెచ్చారా.. అని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకులు అరికేల నర్సారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మొట్టమొదటి సారిగా జిల్లాకు రాగా బుధవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా, డిచ్ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ..టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా మారాక తెలంగాణతో ఆ పార్టీకి సంబంధం తెగి పోయిందని అన్నారు.. కాళేశ్వరం నీరు నిజామాబాద్‌కు రాలేదని, పాత కలెక్టరేట్లు కూల్చి కొత్త కలెక్టరేట్లు కడుతూ దీన్నే అభివృద్ధి అని చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించబోతున్నారని, పక్క పార్టీ నాయకులను చేర్చుకొని బీఆర్ఎస్ పాలన కొనసాగిస్తుందని ఘర్ వాపసి కార్యక్రమంలో భాగంగా మళ్ళీ కాంగ్రెస్ లోకి వచ్చానని తెలిపారు. బాజిరెడ్డి గోవర్ధన్ రూరల్ నియోజకవర్గ లో చేసిందేమీ లేదని, అభివృద్ధి నిల్‌గా ఉందని, తొమ్మిదేళ్లలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేశారా అని అన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 20 మాత్రమే పూర్తి చేసి, మిగిలిన వాటిని వదిలేశారని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం పేరిట మరోసారి మోసం చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం అవుతుందని, ఎన్నికల్లో గెలుపు కోసం బిసి బంధు లాంటి జిమ్మిక్కులు చేస్తున్న ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఐదు లక్షల కోట్లు అప్పు చేసి కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధికారం లోకి రావడం ఖాయమని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి రెండూ ఒక్కటే నని, ఎన్నికల తర్వాత ఆ రెండు పార్టీల పొత్తు ఖాయమన్నారు. రూరల్ లో ఎవరికి టికెట్ ఇచ్చినా కాంగ్రెస్‌ను గెలిపించుకుంటామని అరికరెల నర్సారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమం లో పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, అమృత పూర్ గంగాధర్, పోలసని శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాంసన్, తో పాటు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



అరికెల నర్సారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

బ్యాంకు లింకేజీ లక్ష్యం సాధించడానికి కృషి చేయాలి

- డీఆర్డీఓ, డీఆర్డీఏ పీడీ చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆర్థిక సంవత్సరం 2023-24 లో బ్యాంకు లింకేజీ లక్ష్యం 1032 కోట్లు సాధించడానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని, ఎంటర్ ప్రైజేస్ యూనిట్ల ద్వారా దాదాపు 70 రకాల వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొంది 17 రకాల ఆహార ఉత్పత్తుల యూనిట్లను, ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్డిఓ, డీఆర్డిఏ పిడి చందర్ నాయక్ అన్నారు. ఇందూరు జిల్లా మహిళ పరస్పర సహకార సమాఖ్య 71వ కార్యవర్గ సమావేశం మండల కేంద్రంలోని ఘన్ పూర్ శివారులోని ట్రైజం ట్రైనింగ్ సెంటర్

లో జిల్లా సమాఖ్య అధ్యక్షులు విప్లవ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి చందర్ నాయక్ మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొంది 17రకాల ఆహార యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆహార ఉత్పత్తులను ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, త్వరలోనే జిల్లా సమాఖ్య ద్వారా కూడా యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి లకు సంబంధించి అన్ని విభాగాలలో నిజామాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్ర కో-పరేటివ్ సంస్థ ద్వారా కూడా అవార్డు రావడం గర్వకారణ మన్నారు. సమావేశంలో అడిషనల్ డిఆర్డిఒ మధుసూదన్, డిపిఎం ఎస్ శ్రీనివాస్, సంధ్యారాణి, ఎం.రాచయ్య, మారుతి, ఎపిఎంలు సరోజుని, గంగాధర్, జిల్లా కల్చరల్ కోఆర్డినేటర్ అష్ట గంగాధర్, ఆడిటర్లు, జిల్లా కోశాధికారి వనిత, కార్యదర్శి లక్ష్మీ, జిల్లా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకు సాధించిన విద్యార్థికి

నవతెలంగాణ-ఆర్మూర్

నీట్‌లో ఆల్ ఇండియా ఎంబీబీఎస్ పరీక్షల్లో పట్టణంలోని విద్యనగర్ కాలనీకి చెందిన చెన్న నిత్యశ్రీ 646 మార్కులు సాధించి తెలంగాణలో 228 ర్యాంకు సాదిచడంతో బంధు మిత్రులు కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు బుధవారం అభినందించారు. ఈమెకు లాంగ్ టర్మ్ కోచింగ్‌కు సహకరించిన హైదరాబాద్‌కు చెందిన శ్రీమాన్ స్నేహితులు వ్యాపారవేత్తలు కృష్ణారెడ్డి సిప కుల్దీప్ రెడ్డి, సంగ్రామ్ రెడ్డి తల్లి దండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. చెన్న నిత్య శ్రీకి పీజీ లో కూడా మంచి ర్యాంకు రావాలని ఆకాంక్షించారు.

హైస్కూల్‌కు కంప్యూటర్లు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రమణ రెడ్డి 60 కంప్యూటర్లను వితరణ చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు కంప్యూటర్స్ అందజేశారు. రమణారెడ్డిని ప్రోత్సహించి కంప్యూటర్లను ఇప్పించినందుకు పైపుల రాజిరెడ్డికి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీ గంగారెడ్డి, ఎక్స్ ఎంపీటీసీ నట్ట భోజన్న, సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మండల కోఆప్షన్ బుల్లెట్ అక్బర్ ఖాన్, ఎక్స్ ఎంపీటీసీ కాట్పల్లి నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆదాయ, అభివృద్ధి పనులు చేట్టాలి



నవతెలంగాణ-భీంగల్

మహిళ సంఘులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో ఆదాయ, అభివృద్ధి సనులను చేపట్టి ఆర్థికాబివృద్ధిని సాదించాలని జెడ్పీటీసి చౌట్‌పల్లిరవి, యంపిపి ఆర్మూర్ మహేష్ అన్నారు. బుధవారం ఐకెపి ఆధ్వర్యంలో మండలంలోని మెండోరా గ్రామ సంఘంలో మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలను రాయితీని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతిని సాదించాలని తెలిపారు. మహిళ సంఘలకు సొంత భవనాలను కూడ నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపియం కుంట శ్రీనివాస్, సర్పంచ్ రాజేందర్, ఎంపిటీసి లావణ్య రవీంధర్, సిసి నరేష్, మెండోరా బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దాసరి ముత్తెన్న, వీఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.4వేల పింఛన్

- కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికి నాలుగు వేల రూపాయల పింఛన్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. బుధవారం మండలంలోని ఎక్కపల్లి తండా, ఎక్కపల్లి, సజ్జన్‌పల్లి గ్రామంలో 'హత్ సే హత్ జోడో' కార్యక్రమంలో భాగంగా పల్లెపల్లెకూ కాంగ్రెస్.. గడపగడపకూ సుభాష్ అన్న నినాదంతో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. మహిళలు బొట్టుపెట్టి శాలువా కప్పి పూలదండ వేశారు. రాష్ట్రంలో అధికారం రానున్నది కాంగ్రెస్ పార్టీ అని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చి తీరుస్తుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షులు చంద్రబాబు, రైని దేవేందర్, భిక్కనూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, యువజన సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి

నవతెలంగాణ-ముప్కాల్

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ బాల్కొండ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యావనరుల కార్యాలయంలో ఈ నెల 7న నిర్వహించే ఆర్డీవో కార్యాలయం ముట్టడితో పాటు 10 నుండి జరిగే నిరవధిక సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసులు సైతం సమర్పించడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఒమయ్యా అన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగం కార్మికులకు చెల్లించాల్సిన తొమ్మిది నెలల బకాయి బిల్లులను చెల్లిస్తామని చెప్పి, బకాయి వేతనాల హామీలు ఇస్తూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు మొరపెట్టిన సమస్య పరిష్కరించడం లేదని వాపోయారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 10 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతున్నామని పిలుపునిచ్చారు. జిల్లా అధికార యంత్రాంగం సహకరించాలని, కార్మికులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాల్కొండ, ఆర్మూర్ డివిజన్ నాయకులు గంగాధర్, జోగు రామచందర్, కొట్టుపల్లి లక్ష్మి, ఎర్రం సావిత్రి, సత్తవ్వ, రాజు, సాయమ్మ, వాణి, వనజ పాల్గొన్నారు..

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా తన వంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి అన్నారు. బుధవారం రెండవసారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామకమైన ఆయన నవ తెలంగాణతో మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో మండల అధ్యక్షుని బాధ్యతలు అప్పజెప్పిన జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి మండలంలో కాంగ్రెస్ శ్రేణులను సిద్ధం చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఇంటింటికి కాంగ్రెస్ పేరుతో గ్రామాల్లో ప్రజలను కలుస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజలు మద్దతుగా నిలవాలి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

- వైద్యులు కట్ట నర్సింహా
- ప్రెస్‌క్లబ్‌లో మెగా వైద్యశిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మనోరమ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. సుమారు 130 మంది జర్నలిస్టులు వారి కుటుంబసభ్యులు వైద్య సేవలు వినియోగించు కున్నారు. ప్రముఖ వైద్యులు కట్ట నర్సింహ నేతృత్వంలో 10 మంది వైద్యుల బృందం ఈ శిబిరంలో పాల్గొన్నారు. న్యూరో, కార్డియాక్, ఆర్థోపెడిక్ విభాగాల వైద్య నిపుణులు జర్నలిస్టులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ జమాల్ పూర్ రాజశేఖర్ దంత పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ తో పాటు ఈసిజి, 2డి ఈకో పరీక్షలు నిర్వహించారు.ఉచితంగా మందులు అందజేశారు. విధి నిర్వహణలో ఒత్తిడి కి గురయ్యే జర్న లిస్టులు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని డాక్టర్ కట్ట నర్సింహ సూచించారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్య లను నిర్లక్ష్యం చేయడం వల్ల ఒక్కోసారి ప్రాణానికే ముప్పు ఏర్పడవచ్చుని చెప్పారు. డాక్టర్ల బృందానికి వారి సిబ్బందికి ప్రెస్ క్లబ్ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. పలువురు వైద్యులను సన్మానించారు.



వైద్యులు కట్ట నర్సింహాకు సన్మానం

హన్మంత్ రెడ్డి ఎత్తి పోతల ద్వారా నీళ్ళు ఇవ్వాలని రైతుల విన్నపం

- తక్షణమే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉన్నందున చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తి పోతల పథకం ద్వారా నీళ్ల ఇవ్వాలని మంత్రిని కమ్మర్‌పల్లి రైతులు కోరారు.పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి మండలంలో పర్యటిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని మండల కేంద్రంలోని హస కొత్తూర్ చౌరస్తా వద్ద రైతులు కలిశారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి వెంటనే స్పందించి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు సీఈ సుధాకర్ రెడ్డితో ఫోన్ లో మాట్లాడారు. ఎస్సారెస్పీ నుండి లక్ష్మీ డి4 కెనాల్ ద్వారా శెట్పల్లి చెరువుకి నీళ్ల ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం నిజామాబాద్ ఇరిగేషన్ సీఈ మధుసూదన్ రావుతో మాట్లాడి లక్ష్మి కెనాల్ డి4 ద్వారా శెట్పల్లి చెరువుకు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నుండి నీళ్ల వస్తున్నందున చౌట్ పల్లి లిఫ్ట్ పంపులు సిద్ధం చేసుకొని వెంటనే నీళ్ల ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులతో సంతోషాన్ని పంచుకుంటూ మంత్రి ప్రశాంత్ రెడ్డి టీ తాగారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, సర్పంచ్ గడ్డం స్వామి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాధికారత కల్పించడమే లక్ష్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సాధికారిత కల్పించడమే తన లక్ష్యమని మండలంలోని హాస కొత్తూర్ గ్రామానికి చెందిన మాలావత్ పావని అన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వరంలో హైదరాబాద్ లోని హోటల్ మినర్వాలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ గంప నాగేశ్వర్ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన స్పీకర్లను సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో మాలావత్ పావని ఇంపాక్ట్ సర్టిఫికెట్ ట్రైనర్ విసువల్ ఆర్ట్ టీచర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రైనర్ అయినా సినిమా ఆర్టిస్ట్ గీతా భాస్కర్ చేతుల మీదుగా బెస్ట్ ఫార్మర్ అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందుకున్నారు. 60మంది శిక్షకుల్లో అసాధారమైన ప్రదర్శనకు బెస్ట్ ఫార్మర్ అవార్డు పొందిన పావనిని ఎఫ్ 3 మూవీ ఆర్టిస్ట్ ప్రదీప్ అభినందించారు. పావని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాధికారత కల్పించడం లక్ష్యంగా తన వంతు పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ నళిని, మెంటర్ హేమ ప్రియా చామర్తి, తదితరులు పాల్గొన్నారు .

యాదాద్రిని దర్శించుకున్న మచ్చర్ల గ్రామస్తులు

- బస్సు ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మచ్చర్ల గ్రామస్తులకు 'యాదాద్రి గుట్ట' దర్శనానికి స్వయంగా బస్సు ఏర్పాటు చేసి పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై దర్శనం చేయించి, యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దర్శనానికి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి బుధవారం ఏర్పాట్లు చేశారు. యాదాద్రిలో లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయణమయ్యారు. రెండు చారిత్రక ఆలయాలను చూపెట్టినందుకు ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ జామ్

- నగరంలో నిత్యం ఇబ్బందులు



ట్రాఫిక్ జామ్‌తో ఆగిపోయిన వాహనాలు.. లేని పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలో నిత్యం ఏదో ఒక చోట ట్రాఫిక్ జామ్ అవుతూ వాహనదారులకు ఇక్కట్లు కలిగిస్తోంది. అత్యవసర, హాస్పిటల్ పనుల మీద వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా బుధవారం నగరంలోని బస్టాండ్, ఖలీల్‌వాడీ ప్రాంతంలో పెద్దఎత్తున వాహనాలు బారులు తీరాయి. ప్రారంభోత్సవాలకు ప్రజాప్రతినిధులు వస్తుంటే.. పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలను అరగంట ముందే నుంచి ఆపేస్తుండటంతో వాహనాలు బారులు తీరాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్ జాం అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హాస్పటల్ పరిసరాల్లో ట్రాఫిక్ జాం అవడంతో ఆస్పత్రి, ఇతర పనుల మీదు అర్జెంట్‌గా వెళ్లాల్సిన వారు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. ముందస్తు చర్యలు తీసుకొని వాహనాలను డైవర్ట్ చేస్తూ వాహనాలు నిలిచిపోకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ట్రాఫిక్ లేని సమయంలో గుంపుగా పోలీసులు

ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ హుండీని బుధవారం ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆరు నెలల కాలంలో ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలు మొత్తం 6 లక్షల 34 వేల 867 రూపాయలు కానుకల రూపంలో వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పునర్నిర్మాణ కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుర్చీల వితరణ

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలోని మూడు అంగన్‌వాడి కేంద్రాలకు బుధవారం రోజు హెల్పింగ్ హాండ్స్ యూత్ ఆధ్వర్యంలో పిల్లల సౌకర్యార్థం 30కుర్చీలను అందజేయడం జరిగిందని యూత్ అధ్యక్షులు ఒడ్డి రవీంద్ర తెలిపారు. రానున్న రోజుల్లో హెల్పింగ్ హాండ్స్ యూత్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.